

ప్రతి సంవత్సరం జూలై మాసంలో వికసించే బ్రహ్మ కమలం పుష్పం మూసాపేట డివిజన్ బబ్బుగూడలోని శ్రీధర్‌గౌడ్ నివాసంలో వికసించింది. సోమవారం రాత్రి 8 నుంచి 11 గంటల లోపు 6 పుష్పాలు వికసించాయని తెలిపారు. దీంతో వారు పుష్పాలకు ప్రత్యేక పూజలు చేశారు. బ్రహ్మ కమలం పుష్పాలను చూసేందుకు కాలనీవాసులు ఆసక్తి చూపించారు. – మోతీనగర్

3 గంటల్లో.. 6 పుష్పాలు వికసించాయి

బ్రహ్మ కమలం

వెల్లివిరిసిన ఆనందం

హిమాలయ ప్రాంతంలో వికసించే దివ్య పుష్పం బ్రహ్మ కమలం. ఈ పుష్పాలు ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 27 పుష్పాలు వికసించాయి. రెండు రోజులుగా వీటి సంఖ్య పెరుగుతూ వస్తోంది. శంషీగూడ దాక్షాయణి గ్రీన్ విస్టాస్ అపార్టుమెంట్‌లో సురేందర్ నాయక్, పూనంనాయక్ దంపతుల నివాసంలో బ్రహ్మ కమలం పుష్పాలు వికసించాయి. దీంతో అపార్టుమెంట్‌వాసులు ఈ పుష్పాలను తిలకించేందుకు ఆసక్తి కనబరిచారు. సువాసన వెదజల్లే ఈ బ్రహ్మ కమలం పుష్పాలు ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. ఐదేళ్ల క్రితం హెచ్ఎంటీ హిల్స్ కమ్యూనిటీ భవనంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌లో రెండు మొక్కలను కొనుగోలు చేసి పెంచుకున్నారు. ఈ ఏడాది ఏకంగా 27 పుష్పాలు వికసించటంతో వారి సంతోషానికి అంతే లేకుండా పోయింది. – భాగ్యనగర్‌కాలనీ



గాజులరామారం డివిజన్ రావినారాయణరెడ్డినగర్ ఫేజ్–3లో నివాసముండే మహా నాగరాజు నివాసంలో బ్రహ్మ కమలాలు వికసించాయి. ఐదేళ్ల క్రితం గుజరాత్‌లోని సూరత్ నుంచి మొక్కను తీసుకువచ్చి నాటారు. సంవత్సరం క్రితం ఒక బ్రహ్మ కమలం పూసింది. మంగళవారం ఏకంగా 6 బ్రహ్మ కమలాలు వికసించడంతో వారి ఇంట్లో ఆనందం వెల్లివిరిసింది. – సుభాష్‌నగర్



నాగరాజు ఇంట్లో వికసించిన బ్రహ్మ కమలాలు

ఐదేళ్ల క్రితం నాటితే.. 6 పుష్పాలు

క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

భాగ్యనగర్‌కాలనీ: విద్యుత్ మరమ్మతుల కారణంగా హెచ్ఎంటీహిల్స్ 33/11కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు. అదే విధంగా అడ్డగుట్ట ఫీడర్ పరిధిలోని ఆదిత్యనగర్‌కాలనీ, శుభోదయా కాలనీ, హెచ్‌యంటి హిల్స్ కాలనీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

దేవాలయాలకు బోనాల చెక్కుల పంపిణీ



చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

ఆల్విన్‌కాలనీ: బోనాల పండుగను అంగరంగ వైభవంగా జరుపుకోవాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని 90 దేవాలయాలకు చెక్కులు మంజూరు చేసింది. దేవాలయ కమిటీ ప్రతినిధులకు మంగళవారం ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎండీ ఇబ్రహీం, మోజెశ్, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

మయాంక్‌కు పరామర్శ



మయాంక్‌ను పరామర్శిస్తున్న గొట్టిముక్కల వెంగళరావు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి దయార్‌గూడలో నివాసం ఉంటున్న జ్యోతి కుమారుడు మయాంక్‌పై వీధి కుక్కలు దాడి చేసిన విషయం తెలిసిందే. తీవ్రంగా గాయపడిన బాలుడిని మంగళవారం కాంగ్రెస్ నేత గొట్టిముక్కల వెంగళరావు పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి మెరుగైన చికిత్స అందించాలని కోరారు. అనంతరం జీహెచ్ఎంసీ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వీధి కుక్కల బెడద నివారించాలన్నారు.

బైక్‌ల దొంగలు అరెస్ట్

మాదాపూర్: ఇంటి ముందు పార్క్ చేసిన వాహనాలను దొంగతనం చేస్తున్న వారిని మాదాపూర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం ఇన్‌స్పెక్టర్ తిరుపతి, క్రైం సీఐ వెంకట్ తెలిపిన వివరాల ప్రకారం.. పోలీస్‌స్టేషన్ పరిధిలోని చందానాయక్‌తండా, కాకతీయహిల్స్, కావూరిహిల్స్ తదితర ప్రాంతాలలో ఇంటి ముందు ఉంచిన బైక్‌లు చోరీ అవుతున్నాయని స్థానికులు మాదాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు చేశారు. మాదాపూర్ క్రైం సిబ్బంది న్యూ బోరబండ రోడ్డు వద్ద వాహనాలను తనిఖీలు చేస్తుండగా వీరు అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకున్నారు. ముగ్గురిలో ఒకరు యూసుఫ్‌గూడకి చెందిన మహ్మద్ మొయిన్(21)గా గుర్తించారు. మిగిలిన ఇద్దరు సీసీఎల్‌గా గుర్తించారు.వారి వద్ద నుండి కేటీఎం, గ్లామర్, రెండు యాక్టివాలు రికవరీ చేసినట్టు తెలిపారు. వీటి విలువ దాదాపు రెండు లక్షల రూపాయలు ఉంటాయని తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

మాదాపూర్: విద్యుత్ షాక్‌కు గురై వ్యక్తి మృతి చెందిన సంఘటన మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్, పశ్చిమ గోదావరి జిల్లా, పాలకోడేరు గ్రామానికి చెందిన బి.వీరవెంకట దుర్గారావు(23) నగరంలోని ఈసీఎల్ వద్ద నివాసముంటున్నాడు. రెండు రోజుల క్రితం మాదాపూర్ మెరీడియన్ స్కూల్ సమీపంలో ఒక సైట్‌లో పనిచేస్తున్నాడు. మధ్యాహ్నం 3.30 గంటల ప్రాంతంలో సైట్‌లో అడ్డంగా ఉన్న వైర్లను పక్కన పెట్టడానికి ప్రయత్నిస్తుండగా విద్యుత్ షాక్ తగిలింది. వెంటనే మాదాపూర్‌లోని మాక్సిప్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మరణించినట్టు డాక్టర్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతున్నాం

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



అల్లాపూర్ డివిజన్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్‌లో రూ.1.15కోట్ల నిధులతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు మంగళవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్ అభివృద్ధికి ఇప్పటికే వందల కోట్ల రూపాయలు కేటాయించామన్నారు. ఈ ప్రాంతానికి అనుసంధానంగా కైత్లాపూర్ ఫ్లై ఓవర్ నిర్మించి ఎక్కడికక్కడ లింక్ రోడ్లు ఏర్పాటు చేశామన్నారు. ఈ ప్రాంతం అత్యంత ఖరీదైన ప్రాంతంగా మారిందనటంలో ఎటువంటి సందేహం లేదని తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ల అండదండలతో నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతున్నామని అన్నారు. ఇప్పటికే 90 శాతం పనులు పూర్తి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సబిహా బేగం, అధికారులు ఈఈ సత్యనారాయణ, డీఈ ఆనంద్, ఏఈ రంజిత్, నాయకులు మహమ్మద్ గౌసుద్దీన్, ఐలయ్య, నాగుల సత్యం, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రవీంద్రభారతి ఇన్‌వెస్టిట్యూర్ సెర్మనీ



నిజాంపేట బ్రాంచ్‌లో జరిగిన వేడుకల్లో సీఐ రమేష్, ప్రిన్సిపాల్ పూర్ణిమ



కేపీహెచ్‌బీ బ్రాంచ్‌లో జరిగిన వేడుకల్లో కేపీహెచ్‌బీ సీఐ వెంకటేష్, డీన్ శ్రీలత

కూకట్‌పల్లి: నిజాంపేట, కేపీహెచ్‌బీ కాలనీల్లోని రవీంద్రభారతి బ్రాంచ్‌ల్లో మంగళవారం ఇన్‌వెస్టిట్యూర్ సెర్మనీ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బాచుపల్లి ఎస్సై రమేష్, కేపీహెచ్‌బీ సీఐ వెంకటేష్, ఎస్సై శ్రీనివాసులు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు ఎంపిక అయిన విద్యార్థులకు బ్యాడ్జీలను ప్రదానం చేశారు. అనంతరం పోలీస్ అధికారులు మాట్లాడుతూ.. నేటి తరానికి నాయకత్వ లక్షణాలను విద్యార్థి దశ నుంచే నేర్పించాలన్నారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయని అన్నారు. అనంతరం స్కూల్ ప్రిన్సిపాల్ పూర్ణిమ, పాఠశాల డీన్ శ్రీలతలు మాట్లాడుతూ.. నాయకులు ఎలా ఉంటే నేటి సమాజానికి ఉపయోగకరమో తెలియజేశారు.

సీసీరోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలి



ఏఎస్‌రాజునగర్‌లో సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు

భాగ్యనగర్‌కాలనీ: పనుల్లో జాప్యం లేకుండా యుద్ధ ప్రాతిపదికన సీసీరోడ్డు పనులను పూర్తి చేయాలని కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు అన్నారు. హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని ఏఎస్‌రాజునగర్‌లో చేపట్టిన సీసీరోడ్డు పనులను మంగళవారం ఆయన ప్రారంభించారు. వర్షాకాలంలో నీరు నిలిచిపోకుండా ముందస్తు ప్రణాళికతో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు ఏఈ రాజీవ్, వర్కు ఇన్‌స్పెక్టర్ మహేదవ్, కాలనీవాసులు వేదమూర్తి, వెంకటేష్‌యాదవ్, కృష్ణారెడ్డి, శ్రీనివాస్, ముత్యంరెడ్డి, రాయపురెడ్డి, ఉమాకాంత్, శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి నాయకులు కృషి చేయాలి



ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న గొట్టిముక్కల వెంగళరావు

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ కాంగ్రెస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో మంగళవారం గొట్టిముక్కల వెంగళరావు సమావేశమయ్యారు. పార్టీ బలోపేతం చేయడంలో డివిజన్ నాయకులు ముఖ్యపాత్ర పోషించాలన్నారు. డివిజన్‌లో నెలకొన్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో బీ–బ్లాక్ అధ్యక్షుడు గోపిశెట్టి రాఘవేంద్ర, ఎన్ఎస్‌యూఐ స్టేట్ జనరల్ సెక్రటరీ సయీద్ మిస్బా, అల్లాపూర్ డివిజన్ అధ్యక్షుడు షఫీఉద్దీన్, వర్కింగ్ ప్రెసిడెంట్ నర్సింహ యాదవ్, సీనియర్ నాయకుడు విఠల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరికలు

హఫీజ్‌పేట్ : చందానగర్ హుడా కాలనీలోని ప్రముఖ వ్యాపారవేత్తలు అఫ్జల్, మహ్మద్ ఇస్మాయిల్‌ను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ మంగళవారం ఆయన నివాసంలో బీఆర్ఎస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల చూపు బీఆర్ఎస్ వైపే ఉందన్నారు. పార్టీలో కష్టపడ్డవారికి మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు మిద్దెల మల్లారెడ్డి, హనీఫ్ తదితరులు పాల్గొన్నారు.

గుల్‌మొహర్‌పార్కు కాలనీలో బీజేపీ టిఫిన్ బైఠక్



కార్యక్రమంలో పాల్గొన్న పార్టీ సీనియర్ నాయకులు

శేరిలింగంపల్లి: గచ్చిబౌలి డివిజన్ గుల్‌మొహర్ పార్కు కాలనీలో బీజేపీ టిఫిన్ బైఠక్ కార్యక్రమాన్ని నియోజకవర్గ కన్వీనర్ రాఘవేంద్రరావు అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని ముఖ్య నాయకులు హాజరై టిఫిన్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాయమాటలతో అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ పార్టీ పాలనలో ప్రజలు అష్ట కష్టాలు పడుతున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ వైఫల్యాలను ఎక్కడికక్కడ ఎండగట్టాలని పిలుపునిచ్చారు. బీజేపీ నాయకులు కలసికట్టుగా పనిచేయాలన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు ఎం.రవికుమార్‌యాదవ్, గజ్జెల యోగానంద్, రాష్ట్ర నాయకులు కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి, కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, పార్టీ నాయకులు చింతకింది గోవర్ధన్‌గౌడ్, నరేందర్‌రెడ్డి, పద్మ, నీరటి చంద్రమోహన్, హనుమంత్, రమేష్, ఆంజనేయులు సాగర్, మేరీ, అరుణ తదితరులు పాల్గొన్నారు.

21న శాంతిసరోవర్‌లో 'యూత్ మోటివేషన్'

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ యూత్ వింగ్ ఆధ్వర్యంలో యూత్ మోటివేషన్ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. గచ్చిబౌలిలోని శాంతిసరోవర్ గ్లోబల్ పీస్ ఆడిటోరియంలో 'సక్సెస్ మంత్రా' పేరిట శుక్ర వారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యా హ్నం 1 గంట వరకు జరుగుతుంది. ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ మోటివేషనల్ స్పీకర్ ఈవి గిరీష్, బ్రహ్మకుమారీస్ డైరెక్టర్ కుల్‌దీప్ దీదీ ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు. మరిన్ని వివరాలకు 040 23001234లో సంప్రదించాలి.

టీబీ రహిత జిల్లాయే లక్ష్యం

క్షయ నివారణ జిల్లా అధికారి డా.రాజేశ్వరి

పటాన్‌చెరు టౌన్: టీబీ రహిత జిల్లాగా తయారు చేయడానికి ప్రజలు సహకరించాలని జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ రాజేశ్వరి అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం పటాన్‌చెరు మండలం రుద్రారంలో గల ఎంఎస్ఎన్ లేబరేటరీస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో టీబీపై అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. ఎంఎస్ఎన్ అందిస్తున్న సహకారాన్ని రాష్ట్ర క్షయ నివారణ విభాగం అధికారి జితేంద్ర అభినందించారు.ఈ కార్యక్రమంలో అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ ప్రొడక్షన్ వెంకట్‌రెడ్డి, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వంశీకృష్ణ, డైరెక్టర్ రమేష్ దాసరి, మేనేజర్ పురుషోత్తం, కోఆర్డినేటర్స్ కృష్ణ, నర్సింలు, అరుణ, చంద్రకళ పాల్గొన్నారు.

యాచకుడి మృతి

హఫీజ్‌పేట్ : ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు.. ఈ నెల 14వ తేదీ నల్లగండ్ల రైల్వే అండర్ బ్రిడ్జి కింద గుర్తు తెలియని యాచకుడు అపస్మారక స్థితిలో పడి ఉండగా అటుగా వెళ్తున్న చందానగర్ పోలీసులు ఆ యాచకుడిని గమనించి వెంటనే గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులను ప్రోత్సహించాలి

మాదాపూర్: విద్యార్థులకు చిన్ననాటి నుంచే నాయకత్వ లక్షణాలను నేర్పించాలని గచ్చిబౌలి షీ టీమ్స్ సీఐ సునీత పేర్కొన్నారు. మాదాపూర్‌లోని రవీంద్రభారతి పాఠశాలలో మంగళవారం ఇన్వెస్టిట్యూర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు ఆసక్తి ఉన్న రంగంలో ప్రోత్సహించాలని కోరారు. సమాజాభివృద్ధికి ఉపయోగపడే పలు విషయాలను వివరించాలన్నారు. ఎంపిక చేసిన విద్యార్థులకు బ్యాడ్జీలను అందజేశారు. కార్యక్రమంలో ఎస్సైలు నిహారిక, భవాని, పాఠశాల ప్రిన్సిపల్ సమీన తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య మహిళా క్లీనిక్ తనిఖీ

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి యూపీహెచ్‌సీలోని ఆరోగ్య మహిళ క్లీనిక్‌ను ఆ విభాగం స్టేట్ కోఆర్డినేటర్ డాక్టర్ స్వరాజ్యలక్ష్మి మంగళవారం తనిఖీ చేశారు. యూపీహెచ్‌సీలోని ఓపీ, ల్యాబ్, ఇతర రికార్డులను ఆమె పరిశీలించి మహిళల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ స్వరాజ్యలక్ష్మీ మాట్లాడుతూ ప్రభుత్వం మహిళల కోసం ప్రవేశపెట్టిన ఆరోగ్య మహిళా క్లీనిక్‌లు ఆయా కేంద్రాల్లో ప్రతి మంగళవారం అందుబాటులో ఉంటాయన్నారు.

కాంగ్రెస్ నాయకుల నిరసన

హఫీజ్‌పేట్: రాహుల్ గాంధీపై కేటీఆర్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు హఫీజ్‌పేట్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ముందు కాంగ్రెస్ నాయకులు మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం చేసి వెంటనే అనుచిత వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు.

విద్యార్థులకు డెంటల్ చెకప్

నిజాంపేట్: ప్రగతినగర్ ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం సూరారం మల్లారెడ్డి హాస్పిటల్ డెంటల్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు డెంటల్ చెకప్ నిర్వహించారు. ఆస్పత్రి హెచ్ఓడీ పరప్ప సజ్జనార్ నేతృత్వంలో 300 మంది విద్యార్థులకు ఆస్పత్రి వైద్య సిబ్బంది డెంటల్ చెకప్‌లు చేసి తగు సూచనలు చేశారు. ఈ వైద్య శిబిరంలో జన విజ్ఞాన వేదిక తెలంగాణ రాష్ట్ర ట్రెజరర్, వరప్రసాద్, లైఫ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ ప్రశాంత్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఆశాలత, ఉపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి, దినకర్, భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

దళితుల సమస్యలు పరిష్కరించాలి

- కేంద్రమంత్రికి దళిత సంఘాల వినతి



కేంద్ర సహాయ మంత్రి రాందాస్ అతావాలేను వినతిపత్రం అందజేస్తున్న వినయ్‌కుమార్

కూకట్‌పల్లి: హైదరాబాద్ నగరానికి విచ్చేసిన సోషల్ జస్టీస్ అండ్ ఎంపవర్‌మెంట్ కేంద్ర సహాయమంత్రి రాందాస్ అతావాలేను మంగళవారం దళిత సంఘాల నాయకులు కలిశారు. ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.వినయ్‌కుమార్ దళితుల సమస్యలపై ఆయనకు వినతిపత్రం అందజేశారు. తెలంగాణలో ఉన్న అన్ని కమ్యూనిటీహాల్స్‌కి, అంబేద్కర్ భవన్‌లలో అభివృద్ధి కోసం సోషల్ వెల్ఫేర్ డిపార్టుమెంట్ ద్వారా డైరెక్ట్ ఫండ్స్ రిలీజ్ చేయాలని కోరారు. తెలంగాణ రాష్ట్రానికి ఎస్సీ కమిషన్ చైర్మన్, సభ్యులను వెంటనే నియమించాలన్నారు. సౌత్ ఇండియా నుంచి ఖాళీగా ఉన్న నేషనల్ ఎస్సీ కమిషన్ మెంబర్‌ను వెంటనే నియమించాలన్నారు. ఎన్నో సంవత్సరాల నుంచి ఖాళీగా ఉన్న ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులు వెంటనే భర్తీ చేయాలని కోరారు. అదే విధంగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను వెంటనే విద్యార్థులకు అందజేయాలని విన్నవించారు. ఫీజు రియింబర్స్‌మెంట్‌కు చెందిన ఒక ఓఎస్డీ అధికారిని నియమించి ఆయన పర్యవేక్షణలో ఫీజు రీయింబర్స్‌మెంట్ అందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు కర్క నాగరాజు, రాష్ట్ర కోశాధికారి ప్రమోద్‌కుమార్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ అప్పల రాజు తదితరులు పాల్గొన్నారు.



మూసాపేట: మూసాపేటలో చిత్తారమ్మ బోనాల ఉత్సవాల సందర్భంగా కట్టెలతో నిర్మించిన స్వాగత తోరణం మంగళవారం రోడ్డుపై కుప్పకూలింది. ఈ తోరణానికి ఎల్ఈడీ స్క్రీన్ అమర్చారు. వర్షం కురవడంతో పాటు కట్టెలను భూమి లోపలకు పాతకపోవడంతో స్వాగత తోరణం పడిపోయిందని స్థానికులు పేర్కొన్నారు. వర్షం పడటం, మధ్యాహ్నం సమయం కావడంతో ఆ ప్రదేశంలో లేకపోవటంతో ప్రమాదం తప్పింది. రోడ్లపై ఇలాంటి స్వాగత తోరణాలు ఏర్పాటు చేస్తే ముందు జాగ్రత్తలు తీసుకోవాలని స్థానికులు సూచిస్తున్నారు.

వర్షపునీరు నిల్వకుండా చర్యలు తీసుకోండి



ఎల్లమ్మబండలో వర్షపునీటి తొలగింపు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: ఎల్లమ్మబండ ప్రధాన రహదారిలో వర్షపునీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని మంగళవారం కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలో వర్షపునీరు ఎక్కడ నిలిచినా వెంటనే తొలగించే ఏర్పాట్లు చేయాలన్నారు. వర్షాల నేపథ్యంలో ప్రజలు విద్యుత్ స్తంభాలకు దూరంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సమ్మారెడ్డి, సాయిగౌడ్, పద్మయ్య, రాజన్న, వర్కు ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూను సందర్శించిన జర్మనీ బృందం



హెచ్‌సీయూ వీసీ ప్రొ.బీజేరావును కలిసిన జర్మనీ ప్రతినిధులు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీని జర్మనీ యూనివర్సిటీ ఆఫ్ గొట్టింగెన్ బృందం మంగళవారం సందర్శించింది. ఈ బృందంలో యూనివర్సిటీ డిప్యూటీ డైరెక్టర్ ఇంటర్నేషనల్ రిలేషన్స్ హెడ్ డాక్టర్ తంజాఫాల్కోవ్‌స్కి, ఇంటర్నేషనల్ డైరెక్టర్ నేత్ర బండారి, న్యూఢిల్లీలోని గొట్టింగెన్ ఇండియా ఆఫీస్ కంట్రీ హెడ్ డాక్టర్ ఎలిజబెత్ సాంగేట్‌లు ఉన్నారు. ఈ బృందం మొదట హెచ్‌సీయూలో వీసీ ప్రొఫెసర్ బీజేరావుతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. అనంతరం ప్రొఫెసర్ బీజేరావు మాట్లాడుతూ రెండు విశ్వవిద్యాలయాల మధ్య సహకారాన్ని విస్తరించేందుకు దృష్టి సారిస్తామన్నారు. ఐఓఈ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘనశ్యామ్ కృష్ణ, ఆర్ అండ్ డీ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ స్మరత్ ఎల్ సబత్ విశ్వవిద్యాలయ కార్యకలాపాలు, విద్య, పరిశోధన రంగాలలో వృద్ధి గురించి వారికి వివరించారు.

పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి



వెస్ట్ జోనల్ కార్యాలయంలో జడ్సీ శ్రీనివాస్‌రెడ్డితో సమావేశమైన ఎమ్మెల్యే గాంధీ

- జడ్సీకి సూచించిన ఎమ్మెల్యే గాంధీ

గచ్చిబౌలి: పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ప్రభుత్వ విప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ వెస్ట్ జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డికి సూచించారు. మంగళవారం జోనల్ కార్యాలయంలో జడ్సీని ఎమ్మెల్యే కలిశారు. సమస్యల పరిష్కారం కోసం కొత్త ప్రతిపాదనలు రూపొందించి నిధులు మంజూరు చేయాలని కోరారు. వర్షా కాలంలో లోతట్టు ప్రాంతాలపై అధికారులు దృష్టిసారించి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈఈ శ్రీనివాస్, కార్పొరేటర్లు మంజుల రఘునాథ్ రెడ్డి, ఉప్పలపాటి శ్రీకాంత్, చందానగర్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రఘునాథ్ రెడ్డి తదితరులు ఉన్నారు.